ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

ఆదివారం 25 ఆగస్టు 2024

'ఎసెన్షియా' ఫార్మా కంపెనీలో ఉత్పత్తి నిలుపుదల

అనకాపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల ఘోర ప్రమాదం చోటుచేసుకున్న 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ఫార్మా కంపెనీలో ఉత్పత్తులను నిలిపివేస్తూ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మూడు రోజుల కిందట ప్రమాదం జరిగి 17 మంది మృతి చెందిన నేపథ్యంలో ఇప్పటికే కంపెనీలో అన్ని విభాగాలు మూతపడ్డాయి. కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.

పరిశ్రమల ఇష్టారాజ్యం

ఉద్యోగులు/కార్మికుల భద్రతకు ఏర్పాట్లు శూన్యం



- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- సేఫ్టీ ఆడిట్ నిల్
- కనీసం సీసీ టీవీలు కూడా అమర్చుకోని వైనం
- ప్రమాదాలపై అధికారుల వద్ద కానరాని లెక్కలు
- 'ఎసెన్షియా' ఉదంతంతోనైనా పరిస్థితి మారేనా?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పరిశ్రమల్లో భద్రతను గాలికి వదిలేశారు. నిబంధనాలు పాటించాలని, భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, మాక్ డ్రిల్ చేయాలని అధికారులు కోరినా యాజమాన్యాలు సరిగ్గా స్పందించడం లేదు. భారీఎత్తున ఉత్పత్తులు చేస్తూ, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న హెచ్‌పీసీఎల్, స్టీల్ ప్లాంటు వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు తప్ప ప్రైవేటు యాజమాన్యంలో నడిచేవి పట్టనట్టుగా ఉంటున్నాయి. నోటీసులు ఇస్తే రాజకీయ ఒత్తిళ్లు తీసుకువస్తున్నాయి. పాలకులు కూడా పెట్టుబడిదారులను ఇబ్బంది పెడితే...కొత్త పరిశ్రమలు రావని, ఉపాధి అవకాశాలు దొరకవని చూసీచూడనట్టుగా ఉంటున్నారు. చట్టంలో కూడా లొసుగులు ఉండడంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. భారీ ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరిగినప్పుడు ఒక వారం రోజులు హడావిడి చేస్తున్నారు. ఆ తరువాత ఆ విషయం వదిలేస్తున్నారు.

చట్టం ఏమి చెబుతున్నదంటే...?

ప్రతి పరిశ్రమ తప్పనిసరిగా సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఎసెన్షియా ప్రమాదం తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. దాంతో విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వారం రోజుల్లో ప్రతి పరిశ్రమ సేఫ్టీ ఆడిట్ చేసి, నివేదికలు ఇవ్వాలని శనివారం ఆదేశించారు. పారిశ్రామిక సంస్థల సేఫ్టీ ఆడిట్‌పై కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి కలిసి మార్గదర్శకాలను తయారుచేశాయి. మాన్యుఫాక్చర్, స్టోరేజ్, ఇంపోర్ట్ ఆఫ్ హజార్డస్ కెమికల్స్ (ఎంఎస్ఐహెచ్‌సీ) నిబంధనలు 1989 ప్రకారం ప్రమాదకరమైన రసాయనాలు, పేలుడు పదార్థాలు ఉపయోగించే సంస్థలు తప్పనిసరిగా ఏడాదికి ఒకసారి సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి. వీటిని తనిఖీ చేసే సాంకేతిక పరిజ్ఞానం ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులకు ఉండదు కాబట్టి థర్డ్ పార్టీ ఏజెన్సీలతో ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పించాలి. విశాఖపట్నం జిల్లాలో 57 పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో కేవలం పది మాత్రమే ఈ సేఫ్టీ ఆడిట్ ప్రతి ఏడాది నిర్వహిస్తున్నాయి. హెచ్‌పీసీఎల్, కోరమండల్, స్టీల్‌ప్లాంటు, ఐటీసీ ఇలా భారీ పరిశ్రమలు ఆ జాబితాలో ఉన్నాయి. మిగిలిన 47 పరిశ్రమలు థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ చేయాల్సిన అవసరం లేదు. చట్టంలో ఈ లొసుగు ఉండడంతో ప్రైవేటు పరిశ్రమలు సేఫ్టీ ఆడిట్‌ను గాలికి వదిలేస్తున్నాయి. కొన్ని ఆడిట్ చేయించినా, నిపుణులు చేసిన సూచనలు పాటించడం లేదు. ఎసెన్షియా అదేవిధంగా వ్యవహరించడం వల్ల భారీ ప్రమాదం జరిగింది.

జాయింట్ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి

పరిశ్రమ అయినా, వ్యాపార సముదాయమైనా, ప్రభుత్వ సంస్థ ... మిగతా 8వ పేజీలో

రెడ్ జోన్ పరిశ్రమలే అధికం

- జిల్లాలోని 253 ఫార్మా కంపెనీల్లో 224 ఇవే
- భద్రతపై కొరవడిన పర్యవేక్షణ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి మండలాల్లోని ఎస్ఈజెడ్, ఏపీఐఐసీ, ఐలా పరిధిలో 253కి పైగా ఫార్మా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 224 రెడ్ జోన్(ప్రమాదకర రసాయనాలు వినియోగించే) పరిధిలో ఉండగా, కేవలం 29 మాత్రమే ఆరెంజ్ జోన్‌లో ఉన్నాయి. ప్రధానంగా ఫార్మా కంపెనీల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు బెంబేలెత్తిస్తున్నాయి. పరిశ్రమల్లో సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి ఎస్ఈజెడ్‌ల పరిధిలో అధికారుల గణాంకాల ప్రకారం 2016 నుంచి ఫార్మా కంపెనీల్లో ఇటీవల వరకు అగ్నిప్రమాదాలు 18, రసాయనాల పైపుల లీకు సంఘటనలు 9, కర్మాగారాల్లో ఎత్తైన ప్రదేశాల్లో పనిచేస్తూ జారి పడిన ప్రమాదాలు 11, సాంకేతిక పరమైన సమస్యల కారణంగా 12 ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల 4.. ఇలా మొత్తం 54 ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో మొత్తం 93 మంది మృతి చెందారు. అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మాలో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో 17 మంది మృతి చెందగా, 40 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. అలాగే పరవాడ ఫార్మా పార్కులోని సినర్జీస్ ఫార్మాలో రియాక్టర్ లీకై ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నెల రోజుల వ్యవధిలోనే ఫార్మా కంపెనీల్లో చిన్నా, పెద్దా కలిపి నాలుగు ప్రమాదాలు జరిగాయంటే భద్రతా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

బోర్డులకే పరిమితమైన గ్రేట్ ప్లేస్ టు వర్క్

పలు ఫార్మా కంపెనీలు గ్రేట్ ప్లేస్ టు వర్క్ అనే నినాదంతో ఉద్యోగులు, కార్మికులను ఆకర్షిస్తున్నాయి. దీంతో వివిధ రాష్ట్రాల నుంచి ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాల కోసం వచ్చి చేరుతున్నారు. అయితే ఎసెన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదం ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది. పలు ఫార్మా కంపెనీల యాజమాన్యాలు తాము అత్యంత అధునాతన భద్రతా పరమైన ప్రమాణాలు పాటిస్తున్నట్టు చెబుతున్నా.. ఆచరణలో అవేమీ కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్దేశిత ఉష్ణోగ్రతలు కంటే గాఢత పెరిగిన సందర్భంలో ఆటోమేటిక్‌గా సెన్సార్‌ల ద్వారా సంకేతాలు రావాల్సి ఉంటుంది. అత్యాధునిక సెన్సార్ బేస్‌గా పనిచేసే ప్రమాదాలను ముందుగా గుర్తించే టెక్నాలజీ అందుబాటులో ఉన్నా కంపెనీల యాజమాన్యాలు వాటిని వినియోగించడం లేదని తెలుస్తోంది. అచ్యుతాపురం ఫార్మా కంపెనీల్లో కేవలం 10 శాతం కంపెనీల యాజమాన్యాలు మాత్రమే ఇటువంటి అత్యాధునిక భద్రతా పరికరాలను, సెన్సార్‌లను వినియోగిస్తున్నాయి. అలాగే పరిశ్రమల్లో ఎటువంటి మాక్ డ్రిల్ నిర్వహించడం లేదు. అంతర్గత సేఫ్టీ చర్యలు చేపట్టేందుకు ప్రైవేటు సేఫ్టీ ఏజెన్సీలకు ఆ బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో నిరంతరం కంపెనీల్లో భద్రతా చర్యలు, గ్యాస్, ప్రమాదకరమైన రసాయనాల పైపుల లీకులు, కాలం చెల్లిన రియాక్టర్ల మార్పిడి వంటివి జరగడం లేదు. దీంతో ప్రమాదాలు తరచూ జరగడమే కాకుండా ప్రాణ నష్టం సంభవిస్తోంది. ఇప్పటికైనా ఫార్మా కంపెనీల యాజమాన్యాలు భద్రతా చర్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాలు పునరావృతం కారాదు

పరిశ్రమల యాజమాన్యాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి

మంత్రి వంగలపూడి అనిత



సమావేశంలో మాట్లాడుతున్న వంగలపూడి అనిత, పక్కన ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల, బండారు, పంచకర్ల, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక, తదితరులు

అనకాపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఫార్మా, ఇతర కంపెనీల్లో ప్రమాదాలు పునరావృతం కాకుండా యాజమాన్యాలు పటిష్ట చర్యలు చేపట్టాలని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. శనివారం అనకాపల్లి పట్టణంలోని ఎస్ఆర్ శంకరన్ భవన్‌లో వివిధ పరిశ్రమల యాజమాన్యాలు, కంపెనీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఒకే కంపెనీలో తరచూ ప్రమాదాలు జరిగితే మూసేయాల్సిన పరిస్థితులు తప్పవన్నారు. కంపెనీల యాజమాన్యాలు భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టి, ప్రమాదాల రహిత సెజ్‌గా గుర్తింపు తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఫైర్, గ్యాస్, ఇతర ప్రమాదాలు సంభవించే ముందు మోగాల్సిన అలారాలు పనిచేసేలా కంపెనీల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎసెన్షియా ఫార్మా కంపెనీలో పైప్‌లైన్ లీకేజీపై యాజమాన్యం పట్టించుకోకపోవడం వల్లే ఘోర ప్రమాదం జరిగిందని స్పష్టమవుతోందన్నారు. పరిశ్రమల్లో తక్కువ జీతాలతో నైపుణ్యం లేని కార్మికులతో పని చేయించడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కొన్ని పరిశ్రమల్లో సరైన వెంటిలేషన్ కూడా ఉండడం లేదన్నారు. పరిశ్రమలున్న పరిసరాల్లోని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది సంఖ్యను పెంచుతామని తెలిపారు. ప్రతి పరిశ్రమలో ఇకపై అంతర్గత సేఫ్టీ ఆడిట్‌లు విధిగా జరగాలన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ అంతర్జాతీయ పరిశ్రమల భద్రత సలహాదారులను సంప్రతించి పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమల్లో సేఫ్టీ ప్రొటోకాల్ అమలు చేయడం ద్వారా ప్రమాదాలను అదుపు చేయవచ్చన్నారు. పరిశ్రమల కేంద్ర కార్యాలయం విశాఖలో ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా రోడ్డు మ్యాప్ అమలు చేయడం ద్వారా ప్రాణాపాయం లేకుండా చూడాలన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అధికారులతో ఉన్నత స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి తనిఖీలు తరచూ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పరిశ్రమల్లో భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా కృషి చేయాలని సూచించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు ప్రమాదాలు జరిగిన సమయంలోనే భద్రతా చర్యలు చేపట్టడం కాకుండా నిరంతరాయంగా సేఫ్టీపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. జేఎన్‌పీసీ మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ కార్యదర్శి జె.సుబ్బారావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అచ్యుతాపురం సెజ్ అసోసియేషన్ అధ్యక్షుడు మాన్యప్రసాద్ మాట్లాడుతూ ఫార్మా టాస్క్‌ఫోర్స్ క్రియాశీలకంగా పనిచేసేలా తయారు చేస్తామన్నారు. సమీక్ష సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక, జేసీ జాహ్నవి, పరిశ్రమల అధికారి శ్రీధర్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



హాజరైన వివిధ పరిశ్రమల ప్రతినిధులు, అధికారులు

కైలాసపట్నం అనాథాశ్రమంపై విచారణ

- వివరాలు సేకరించిన జిల్లా జడ్జి



కైలాసపట్నం అనాథాశ్రమాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి జిల్లా జడ్జి శ్రీవిద్య

కోటవురట్ల, ఆగస్టు 24:

కోటవురట్ల మండలం కైలాసపట్నంలో పాసా అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై అనకాపల్లి జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య శనివారం విచారణ చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం ఆమె అనాథాశ్రమాన్ని సందర్శించి పాస్టర్ సతీమణి రమను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో ఎంత మంది పిల్లలు ఉండేవారు?, అనారోగ్యానికి గురైతే ఎందుకు ఆస్పత్రికి తీసుకు వెళ్లలేదు?, స్థానికంగా ఆస్పత్రి ఉందా?.. లేదా? అని ప్రశ్నించారు. ఆశ్రమం నిర్వహణకు నిధులు ఎక్కడ నుంచి వస్తాయని అడిగారు. గత శనివారం పిల్లలకు ఎటువంటి ఆహారం పెట్టారు?, ఎవరెవరు దాతలు సరఫరా చేశారు? అనే కోణంలో విచారణ చేశారు. గిరిజన విద్యార్థులను ఏయే ప్రాంతాల నుంచి ఆశ్రమానికి తీసుకు వచ్చారు?, బాలికలు, బాలురు ఎక్కడ నిద్రిస్తారు? అని అడిగి తెలుసుకున్నారు. 86 మందికి ఎన్ని మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం ఆశ్రమంలో ఉండి కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురైన గొట్టివాడ గిరిజన గ్రామానికి చెందిన సావిత్రి ఇంటికి జిల్లా న్యాయమూర్తి స్వయంగా వెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో ఎటువంటి ఆహారం తీసుకున్నారని ప్రశ్నించారు. జిల్లా జడ్జి వెంట నర్సీపట్నం సబ్ కోర్టు సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్ ఉన్నారు. విచారణ నివేదికను హైకోర్టుకి సమర్పిస్తామని ఆమె తెలిపారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పక్కాగా ఏర్పాట్లు

- విశాఖ పోర్టు స్టేడియంలో నేటి అర్ధరాత్రి నుంచి ఎంపికలు ప్రారంభం

- 7వ పేజీలో..

అచ్యుతాపురంలో అధునాతన ఆస్పత్రి అవసరం

అంబులెన్స్‌లు అందుబాటులో ఉండాలి

- గ్రామ సభలో తీర్మానం చేస్తేనే ఉపాధి పనులు
- గృహ నిర్మాణ బకాయిలు విడుదల చేయండి
- పింఛన్ల కోతపై సర్వే నిజమేనా?
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):

ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులకు సత్వర చికిత్స అందించడానికి అచ్యుతాపురంలో అధునాతన ఆస్పత్రి నిర్మించాలని, నిత్యం అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని జిల్లా పరిషత్ స్టాండింగ్ సమావేశాలలో సభ్యులు కోరారు. నాలుగు రోజుల క్రితం అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా కర్మాగారంలో ప్రమాదం జరిగినప్పుడు బాధితులను తరలించేందుకు అంబులెన్స్‌లు లేకపోవడంతో బస్సుల్లో తరలించారని ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన 1, 2, 4, 7 స్థాయీ సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ సమావేశమందిరంలో జరిగాయి. ఈ సందర్భంగా అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు మాట్లాడుతూ ఎసెన్షియా ప్రమాదంలో బాధితుల తరలింపునకు అంబులెన్స్ లేకపోవడం ఆవేదనకు గురిచేసిందన్నారు. అచ్యుతాపురంలో కేంద్రం మంజూరుచేసిన ఈఎస్ఐ ఆస్పత్రిని తక్షణమే నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ దశలో జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని పరవాడలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని సమావేశాలల్లో పలుమార్లు కోరిన విషయాన్ని గుర్తుచేశారు. కర్మాగార యాజమాన్యాలతో మాట్లాడి అంబులెన్స్‌లు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయితే కోటవురట్ల మండలం కైలాసపట్నం ఘటనలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన బాలలు, ఎసెన్షియా ఘటనలో బాధితులకు వైద్యులు అందించిన సేవలు ప్రశంసనీయమని ఆమె కితాబు ఇచ్చారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉపాధి హామీ పనుల కోసం నిర్వహించిన గ్రామసభలకు జడ్పీటీసీ సభ్యులకు ఆహ్వానించలేదని ఫిర్యాదు చేయగా, సమాచారం ఇవ్వాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. దీనికి అధికారులు



అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు

బదులిస్తూ గ్రామ సభలో చేసిన తీర్మానాల మేరకు ప్రతిపాదించిన పనులకు ఆమోదం లభిస్తోందని, తరువాత మండల, జడ్పీ సమావేశాల ఆమోదం అవసరమన్నారు. గ్రామ సభలపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇస్తామన్నారు. ఈ దశలో చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని ఉపాధి హామీ పథకం కింద ఆయా గ్రామ సభల్లో పనులు ప్రతిపాదించాలని సూచించగా, అధికారులు స్పందిస్తూ ప్రస్తుత ఏడాది, తరువాత నాలుగేళ్లకు సరిపడా పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు.

రహదారులకు ఇరువైపులా పొదలతో ప్రమాదాలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రధాన రహదారులకు



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ఇరువైపులా పొదలు పెరగడంతో మలుపులున్న చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని దేవరాపల్లి, చింతపల్లి, గొలుగొండ జడ్పీటీసీ సభ్యులు కర్రి సత్యం, పోతుల బాలయ్య, గిరిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరగా చైర్‌పర్సన్ సుభద్ర స్పందించి ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అధ్వానంగా ఉన్న రోడ్లు బాగుచేయాలని పద్మనాభం, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యులు సుంకరి గిరిబాబు, దొండా రాంబాబు కోరగా, రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయని అచ్యుతాపురం జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు ఫిర్యాదు చేశారు. బలహీన వర్గాలకు చెందిన గృహ నిర్మాణదారులకు ఈ ఏడాది మార్చి నుంచి బిల్లులు రాలేదని గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు ప్రస్తావించగా, హౌసింగ్ అధికారులు బదులిస్తూ త్వరలో బిల్లులు మంజూరవుతాయన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ కొత్తగా ఇళ్ల కోసం పెట్టిన దరఖాస్తులను ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా వచ్చిన మార్గదర్శకాల మేరకు ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్రాల వాటా కింద రూ.4 లక్షలు మంజూరుచేస్తామని సంబంధిత అధికారి తెలిపారు. పరవాడ ... మిగతా 8వ పేజీలో

క్షతగాత్రులకు కేంద్ర సహాయ మంత్రి పరామర్శ

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడి అనకాపల్లి పట్టణంలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శనివారం రాత్రి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పరామర్శించారు. - వార్త 7వ పేజీలో..



క్షతగాత్రులను పరామర్శిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

అమ్మవారి హారం ఏమైంది?

మరిడి మహాలక్ష్మి బంగారు హారం స్థానంలో గిల్ట్ నగ

- ఏప్రిల్ 19న జేవీవో, ఎప్రైజర్ సమక్షంలో ఆభరణాల అప్పగింత
- అన్నీ సక్రమంగా ఉన్నాయని స్వీకరించిన అధికారులు
- తాజాగా నాణ్యత నిర్ధారణలో గిల్ట్‌గా తేలిన వైనం
- దేవదాయశాఖ కమిషనర్‌కు జిల్లా అధికారిణి ఫిర్యాదు

నర్సీపట్నం, ఆగస్టు 24:

స్థానిక మరిడి మహాలక్ష్మి అమ్మవారికి జాతర సమయంలో అలంకరించి ట్రెజరీలో భద్రపరిచిన బంగారు హారం తాజాగా చేపట్టిన నగల నాణ్యత నిర్ధారణలో గిల్ట్ ఆభరణంగా మారిపోయినట్టు దేవదాయ శాఖ అధికారులు గుర్తించారు. ఇది ఎలా జరిగిందో అర్థంకాక తల పట్టుకుంటున్నారు. దీనిపై దేవదాయ శాఖ జిల్లా అధికారిణి సుధారాణి ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.



పండగ సమయంలో బంగారు ఆభరణాల అలంకరణలో మరిడి మహాలక్ష్మి అమ్మవారు

మరిడిమహాలక్ష్మి అమ్మవారి ఆలయం నిర్వహణ, పండగ ఏర్పాట్లు పూర్వ కాలం నుంచి అయ్యన్నపాత్రుడు కుటుంబీకులు చూసుకునేవారు. మూడేళ్లకు ఒకసారి జరిగే పండగ సమయంలో అమ్మవారికి ఆభరణాలు అలంకరించి తర్వాత వారి కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉంచేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2022 ఆగస్టు 2న ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నారు. ఆ ఏడాది పండగ సమయంలో అమ్మవారికి ఆభరణాలు అలంకరించలేదు. 2023 ఏప్రిల్ 19వ తేదీన 510 గ్రాముల బంగారం ఆభరణాలు, ఐదున్నర కిలోల వెండి వస్తువులను మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు దేవదాయ శాఖ అధికారులకు అప్పగించారు. దేవదాయ శాఖ నగల వెరిఫికేషన్ అధికారి, ఎప్రైజర్ (బంగారం నాణ్యత నిర్ధారణ ఉద్యోగి) నగలు పరిశీలించి అవన్నీ బంగారం ఆభరణాలుగా నిర్ధారించారు. అధికారికంగా రికార్డులలో నమోదు చేసి ఈవో గంగారావు, జేవీవో, ఎప్రైజర్ సంతకాలు చేశారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి భారీగా బంగారం, వెండి ఆభరణాలు దేవదాయ శాఖ స్వాధీనం చేసుకునేటప్పుడు జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో జరగాలి. అయితే ఆభరణాల స్వాధీనం తంతు ఈవో సమక్షంలో నడిపించడంలో జిల్లా అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తున్నదని విమర్శలు వస్తున్నాయి.

పండగ ముగిశాక నగలు ట్రెజరీలో భద్రం

అమ్మవారి జాతర సందర్భంగా ఏప్రిల్ 21న అమ్మవారికి అలంకరించడానికి అర్చకులకు నగలు అందజేశారు. పండగ ముగిసిన తరువాత మే 2న దేవదాయ శాఖ అధికారులు అర్చకుల నుంచి నగలు తీసుకు వెళ్లారు. బ్యాంకు లాకరులో పెట్టడానికి అవకాశం లేకపోవడంతో బాక్సులో పెట్టి సీల్ చేసి ట్రెజరీలో భద్రపరిచారు.

ఆలయ ధర్మకర్తకు తిరిగి బాధ్యతలు

రెండేళ్ల క్రితం దేవదాయశాఖ పరిధిలోకి తీసుకున్న మరిడితల్లి ఆలయ నిర్వహణ బాధ్యతలు తిరిగి మూడు రోజుల క్రితం ఆలయ ధర్మకర్త, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి తిరిగి అప్పగించారు. అమ్మవారి ఆభరణాలు అప్పగించే ప్రయత్నం చేయగా బంగారం నగలు నాణ్యత నిర్ధారణ చేయించారు. ఆభరణాలలో 390 గ్రాముల బరువు ఉన్న హారం గిల్ట్ నగ అని తేలింది. దీంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు నగలు స్వాధీనం ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

వివాహిత ఆత్మహత్య కేసులో నలుగురి అరెస్టు




భర్త, అత్త, మామ, ఆడపడుచుని అరెస్టు చేసిన పోలీసులు

చింతపల్లి, ఆగస్టు 24 : వివాహిత ఆత్మహత్య కేసులో నలుగుర్ని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలోని నెయ్యలవీధిలో ఈ నెల 20న వివాహిత కర్రి భారతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతురాలు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ ప్రారంభించారు. శనివారం మృతురాలు భర్త మణికంఠ, అత్తా మామలు అచ్చమ్మ, వెంకటేశ్, ఆడపడుచు వరలక్ష్మిలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎస్‌ఐ మాట్లాడుతూ వివాహిత భారతిని భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచు మానసికంగా, శరీరికంగా హింసించారన్నారు. ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు కుటుంబ సభ్యులు ప్రేరేపించారని దర్యాప్తులో గుర్తించామన్నారు. ఈ మేరకు నలుగుర్ని గృహ హింస, ఆత్మహత్యకు ప్రేరేపించిన నేరాలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

మందుబాబుల ఆకతాయి చేష్టలు

- గాయాల పాలవుతున్న రైతులు, కూలీలు
- మద్యం బాటిళ్లతో నిండుతున్న వ్యవసాయ బావులు
- బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నియంత్రణ కరువు

ఖాళీ సీసాలు పగులగొట్టి పంట పొలాల్లో వేస్తుండడంతో ఇబ్బందులు



వ్యవసాయ బావిలో పడి ఉన్న మద్యం బాటిళ్లు

మాడుగుల, ఆగస్టు 24: మందుబాబుల ఆకతాయిచేష్టలు శ్రుతిమించుతున్నాయి. ఇక్కడ, అక్కడా అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతూ ఖాళీ సీసాలను పడేస్తున్నారు. వీరు మద్యం తాగేందుకు పొలాలను కూడా తమకు అనువైన ప్రాంతంగా ఎంచుకుంటున్నారు. అక్కడితో ఆగకుండా సీసాలను పగులగొట్టి నడిచే దారుల్లో పడేయడం, పంట బావుల్లోకి విసిరేస్తుండడం చేస్తున్నారు. దీంతో పంట బావులు మద్యం సీసాలతో నిండిపోయింది. మద్యం సీసాలను పగులగొట్టి దారుల్లో పడేయడంతో గాజు పెంకులు గుచ్చుకొని గాయాల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో సైతం మద్యం సీసాలను పడేస్తుండడంతో పొలం పనులు చేసే సమయంలో తమకు, పశువుల కాళ్లకు గాజు పెంకులు



ఆరు బయట తాగి పడేసిన మద్యం సీసాలు

గుచ్చుకుంటున్నాయని వాపోతున్నారు. ఇటీవల ఖరీఫ్ పనులు చేపట్టే సమయంలో పలువురు రైతులు, రైతు కూలీలు, పశువుల కాళ్లకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాలయ్యాయి. ఆ తర్వాత కొన్నాళ్ల పాటు పనికి వెళ్లలేక అవస్థలు పడ్డామని పలువురు రైతు కూలీలు తెలిపారు. మద్యం రాయుళ్ల చేష్టలు ఇప్పుడు పెద్ద సమస్యగా మారిందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామాలకు సమీపంలో వరినాట్లు వేసిన పొలాల్లో మందుబాబులు రాత్రి వేళల్లో మద్యం మత్తులో దిగి తొక్కి వేస్తుండడంతో పంటకు నష్టం వాటిల్లుతోందని రైతులు అంటున్నారు. ఇలాంటి ఆకతాయిపనుల వల్ల తాము నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కొన్నిసార్లు తాము హెచ్చరిస్తున్నా ఎవరూ వినడం లేదని రైతులు అంటున్నారు. మద్యం తాగడంపై పరిమితి లేకపోవడం, ఆకతాయి పనులపై నియంత్రణ కొరవడడంతో మద్యం రాయుళ్లు రెచ్చిపోతున్నారని రైతులు, రైతు కూలీలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు మద్యం రాయుళ్ల ఆగడాలపై కన్నేసి ఉంచాలని ముఖ్యంగా.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడాన్ని నియంత్రించాలని కోరుతున్నారు.

ఈపీడీసీఎల్ సీవీఓగా రామకృష్ణప్రసాద్



సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిసిన సీవీఓ రామకృష్ణ ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులైన కె.రామకృష్ణప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి సర్కిళ్ల వినియోగదారులు దీర్ఘకాలకంగా పరిష్కారం కాని విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన ఫిర్యాదులు టోల్ ఫ్రీ నంబరు 1912కి తెలియజేయాలని కోరారు.

ఫార్మా ప్రమాదాలపై అఖిలపక్షం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్



బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రామకృష్ణ

మహారాణిపేట, ఆగస్టు 24 : ఫార్మా కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. పరవాడ ఫార్మాసిటీలోని 'సినర్జిన్' కంపెనీలో గురువారం అర్థరాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రమాదాలకు యాజమాన్యాలతో లాలూచీ పడిన అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఫార్మా కంపెనీలలో సరైన భద్రతా చర్యలు, కార్మికులకు శిక్షణ సౌకర్యాలు లేవని అందువల్లే ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇవి ప్రమాదాలు కావని, యాజమాన్యాలు చేసిన హత్యలని వారిపై కేసు నమోదుచేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ఫార్మా కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి లోపాలు ఉన్నట్టయితే లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫార్మా కంపెనీలలో నెలకొన్న పరిస్థితులపై చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, వి.విమల ఎస్‌కే రహమాన్ పి.చంద్రశేఖర్, మన్మథరావు క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఎసెన్షియా' ప్రమాద క్షతగాత్రులకు కేంద్ర మంత్రి పరామర్శ



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడి అనకాపల్లి పట్టణంలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శనివారం రాత్రి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పరామర్శించారు. ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస్ వారికి అందుతున్న వైద్యసేవలను వివరించారు. క్షతగాత్రులతో మంత్రి మాట్లాడుతూ ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎసెన్షియా దుర్ఘటనలో 17 మంది మృతిచెందడం బాధాకరమన్నారు. ఆస్పత్రిలో క్షతగాత్రులకు మంచి వైద్యం అందుతుందని, ఏ ఒక్కరికి ప్రాణహాని లేదన్నారు. రెండు రోజుల్లో చాలా మంది డిశ్చార్జి అవుతారన్నారు. ఈ సంఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందన అభినందనీయమన్నారు. ప్రభుత్వాలు పరిహారం కూడా ప్రకటించడంతో పెద్ద ఉపశమనం కలిగిందని వివరించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, డీటీ వై శ్రీరామ్మూర్తి, బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డాక్టర్ సత్యనారాయణ, గొంతిన భక్తసాయిరాం, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక జైళ్లుగా ఎస్‌ఈజెడ్ కర్మాగారాలు

- కార్మికుల ప్రాణాలు పోయినా 'ఎసెన్షియా' యాజమాన్యానికి పట్టదా?
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు ఆగ్రహం
- 28న యాజమాన్యాల తీరుపై విజయవాడలో నిరసన : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తుమ్మపాల, ఆగస్టు 24: ప్రస్తుతం ఆధునిక జైళ్లుగా సెజ్‌లోని కర్మాగారాలు తయారయ్యాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. అనకాపల్లిలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో గల ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం అత్యంత బాధాకరమన్నారు. దీనిపై స్పందించాల్సిన సంబంధిత యాజమాన్యం అడ్రస్ లేకుండా పోవడం దారుణమన్నారు. 17 మంది కార్మికులు మృతి చెందగా, 35 మంది వరకు గాయాలపాలై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నా కంపెనీ యాజమాన్యం పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇష్టానుసారంగా పరిశ్రమల నిర్వహణ సాగుతున్నప్పటికీ వాటిపై ప్రభుత్వానికి నియంత్రణ లేదన్నారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని, కర్మాగారాల పరిసర ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే స్పెషల్ ఎకనామిక్ జోన్ చట్టాలను తొలగించాలని, ట్రేడ్ యూనియన్‌లతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు మాట్లాడుతూ కర్మాగారాల్లో తరుచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా, సంబంధిత శాఖలు పట్టించుకోకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. తక్షణమే ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ జరగాలన్నారు. కర్మాగారాల యాజమాన్యాల తీరును నిరసిస్తూ ఈనెల 28న విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఏఐఎఫ్‌టీయూ నాయకులు గణేష్‌పాండా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య, జిల్లా నాయకులు రాజాన దొరబాబు, ఆర్.శంకరరావు, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కారిడార్ భూముల పరిశీలన



రాజయ్యపేట తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లి, ఆగస్టు 24: మండలంలోని విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన భూములను కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం పరిశీలించారు. హైవే నుంచి కారిడార్ ప్రాంతానికి సేకరించాల్సిన భూములు, రహదారి నిర్మాణ ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. కాగిత, పాటిమీద, మూలపర్ర గ్రామాల్లో భూములను పరిశీలించారు. కారిడార్ కోసం సేకరించిన భూముల సరిహద్దులను, ఇతర అంశాలను మ్యాప్‌ల ద్వారా ఆర్డీవో జయరాం, తహసీల్దార్ అంబేడ్కర్ వివరించారు. తీర ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఆర్ఆర్ ప్యాకేజీ, నిర్వాసిత రైతుల సమస్యలకు సంబంధించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

- అవకతవకలకు పాల్పడితే చర్యలు
- రాష్ట్ర గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా



ఇసుక డిపో వద్ద కలెక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ముకేశ్‌కుమార్ మీనా

అగనంపూడి, ఆగస్టు 24 : ఉచిత ఇసుక విధానాన్ని అధికారులు పారదర్శకంగా అమలు చేయాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని రాష్ట్ర గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా హెచ్చరించారు. విశాఖ నగర పరిధిలోని అగనంపూడిలో గల ఇసుక డిపోను, పీనమడక సచివాలయంలో ఏర్పాటుచేసిన ఇసుక బుకింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్‌తో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇసుక నిల్వలు, సరఫరా విధానం, బుకింగ్ ప్రక్రియ, ఇతర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోడింగ్, బుకింగ్ ప్రక్రియ వేర్వేరుగా నిర్వహిస్తున్నారా?, లేదా?...అని ఆరా తీశారు. బుకింగ్ కేంద్రంలోని రశీదు పుస్తకాలను, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇసుకను ప్రజలకు సజావుగా అందించాలని సూచించారు. ఇసుక సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని ముకేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ప్రస్తుతం డిపోలో ఉన్న ఇసుక నిల్వల గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇసుక కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి...ఇక్కడి పరిస్థితులు, అధికారులు, సిబ్బంది సహకారం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మైన్స్ ఏడీ రాజు, తహసీల్దార్ శ్రీవల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పక్కాగా ఏర్పాట్లు

- విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- నేటి అర్ధరాత్రినుంచి ఎంపికలు ప్రారంభం



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థుల కోసం ఏర్పాటుచేసిన బాక్స్‌లు

అక్కయ్యపాలెం, ఆగస్టు 24: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న విశాఖలోని పోర్టు స్టేడియంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను శనివారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. డైమండ్ జూబ్లీ స్టేడియంలో మెయిన్ ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో అక్కడి పరిస్థితులను గమనించారు. ట్రాక్ పునరుద్ధరణ బారికేడ్లు, లైట్లు, టెంట్లు, క్యూ లైన్ల సునిశితంగా పరిశీలించారు. అధికారులు, ఇతర సిబ్బంది ఉండేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్న వసతి కేంద్రాన్ని, ఎంపిక సమయంలో అభ్యర్థులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ర్యాలీ ప్రారంభం నాటికి పనుల్లో పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా ఎంపిక ప్రక్రియకు వచ్చే వారికి ముందస్తు సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఈపీడీసీఎల్, స్పోర్ట్స్, వైద్య తదితర విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ర్యాలీని విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. పలువురు ఆర్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

గ్రామాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు కేటాయించండి

- 'సింహాద్రి' సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాకు ఎంపీ సీఎం రమేశ్ విజ్ఞప్తి



సీఎం రమేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీజీఎం

పరవాడ, ఆగస్టు 24 : మండల పరిధిలో గ్రామాల అభివృద్ధికి సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సంస్థ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాకు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ఎంపీ రమేష్ సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన సముద్రిక అతిథిగృహంలో సీజీఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్టీ పీసీ ఫ్లైయాష్ లోడుతో లారీలు రాకపోకలు సాగించడం వల్ల పరవాడ-అనకపల్లి ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైందని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. సంస్థ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్నారు. నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు సహాయ సహకారాలు అందించాల్సిం దిగా కోరారు. ఉపాధి కల్పనలో నిర్వాసిత యువతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మానవరపు అప్పలనాయుడు, మాదంశెట్టి నీలబాబు, జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పీఆర్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, సర్పంచ్‌లు సిరపురపు అప్పలనాయుడు, మోటూరు సన్యాసినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, వివిధ విభాగాల జీఎంలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల వినతి మేరకు బాలికకు టీసీ ఇవ్వలేదు

- కోనాం బాలయోగి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ హిమాచల

చీడికాడ, ఆగస్టు 24: తల్లిదండ్రుల వినతి మేరకు బాలికకు టీసీ ఇవ్వలేదని మండలంలో కోనాం బాలయోగి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ హిమాచల తెలిపారు. శనివారం ఆమె పాఠశాలలో విలేఖరులతో మాట్లాడుతూ ఇదే గురుకులంలో చదువుతున్న విద్యార్థిని ఇంటికి వెళ్లిపోవడానికి శుక్రవారం ప్రయత్నించిన విషయం విధితమే. దీనిపై బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, వారు శుక్రవారం మధ్యాహ్నం రావడంతో వారితో మాట్లాడగా భవిష్యత్తులో ఇలా జరగకుండా చూసుకుంటామని వారు హామీ ఇవ్వడంతో రెండు రోజుల పాటు తమతో పాటు ఉంచి పంపుతామని కోరారన్నారు. బాలిక తల్లిదండ్రుల వినతి మేరకు అంగీకరించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. బాలికను బుధవారం పాఠశాలకు తీసుకువస్తామని తల్లిదండ్రులు చెప్పారన్నారు. ఇక్కడ చదువుతున్న ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచుతామని, గుణాత్మక విద్యను అందించేందుకు ఎప్పుడూ కృషి చేస్తామని ప్రిన్సిపాల్ హిమాచల తెలిపారు.

యాజమాన్యాల నిర్లక్ష్యం వల్లే కర్మాగారాల్లో ప్రమాదాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆగ్రహం
- 'ఎసెన్షియా' ప్రమాదంలో గాయపడిన వారికి పరామర్శ



ఆస్పత్రిలో క్షతగాత్రులతో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తుమ్మపాల, ఆగస్టు 24: కర్మాగారాల్లో కేవలం యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ఆరోపించారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో గాయాలపాలై అనకాపల్లి ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శనివారం ఆయన పరామర్శించారు.

ప్రమాదం జరిగిన తీరు, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌లో 288, పరవాడలో 90, శ్రీకాకుళంజిల్లా పైడిభీమవరంలో 40 ఫార్మా కంపెనీలు ఉన్నాయన్నారు. వీటిలో తరుచూ ప్రమాదాలు జరుగుతూ కార్మికులు విగతజీవులు, క్షతగాత్రులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగిన తరువాత నాయకులు వస్తున్నారే తప్ప, యాజమాన్యాల ఆచూకీ ఎక్కడని ప్రశ్నించారు. లాభాలు తప్ప కార్మికుల జీవితాలు పట్టవా.. అని ప్రశ్నించారు. తక్షణమే ఎసెన్షియా పరిశ్రమ ఎండీ, పాలకవర్గంపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కేవీవీ ప్రసాద్, ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శులు బాలేపల్లి వెంకటరమణ, ఎం.పైడిరాజు, ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అత్తిలి విమల, నాయకులు జి.గురుబాబు, ఆర్.అప్పలరాజు, బి.సుబ్బలక్ష్మి, బి.పరమేశ్వరి, బి.అర్జున్, కాసుబాబు, వి.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక యువతకు ఉపాధి కల్పనకు కృషి : అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 24 : స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎన్టీపీసీ, హిందూజా సంస్థల అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శనివారం హిందూజా సంస్థలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌ల నుంచి వచ్చే యాష్ పౌండ్, దుమ్ము, ధూళి వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హిందూజా సంస్థకు రైల్వే లైన్ వేస్తే కాలుష్య సమస్యను చాలా వరకు నివారించవచ్చన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా కంపెనీల యాజమాన్యాలు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కంపెనీల్లో ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలను పాటించాలని సీఎం రమేశ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా కంపెనీల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వసతి గృహాలు తనిఖీ

- పిల్లలకు పౌష్టికాహారం అందడం లేదని గుర్తించినట్టు సమాచారం
- 'పేట'లో అనుమతుల్లేకుండా అసౌకర్యాల మధ్య మదరసాల నిర్వహణ!
- త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక : టీడీ అప్పారావు



ఓ చిల్డ్రన్స్ హాస్టల్‌లో రికార్డులు తనిఖీచేస్తున్న అధికారుల బృందం

పాయకరావుపేట, ఆగస్టు 24 : మండలంలో నిర్వహిస్తున్న ప్రైవేటు వసతి గృహాలను శనివారం మండల కమిటీ తనిఖీ చేసింది. డీటీ అప్పారావు ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులు ఏఎస్‌డబ్ల్యూవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎస్ఐ, పంచాయతీ రాజ్ ఏఈ పట్టణంలోని రెండు ప్రైవేటు వసతి గృహాలతో పాటు ఒక మదరసాల, ఎస్.నర్సాపురం గ్రామంలో ఉన్న ప్రైవేటు వసతి గృహాన్ని పరిశీలించారు. ఆయా వసతి గృహాలకు అనుమతులు, విద్యార్థులకు అందజేస్తున్న భోజనం, వసతిపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో అన్ని వసతి గృహాల్లో ఉంటున్న పిల్లలకు పౌష్టికాహారం అందడం లేదని కమిటీ సభ్యులు గుర్తించినట్టు తెలుస్తోంది. అదేవిధంగా పట్టణంలో ఉన్న మదరసాల నిర్వాహకులు సరైన అనుమతులు చూపకపోగా, బీహార్ రాష్ట్రం నుంచి 19 మంది చిన్నారులను తీసుకువచ్చి కనీస వసతుల్లేని ఇంట్లో వసతిని నిర్వహిస్తున్నట్టు గుర్తించారని సమాచారం. వీటిపై డీటీ అప్పారావును వివరణ కోరగా, మండలంలో తనఖీచేసిన నాలుగు ప్రైవేటు వసతి గృహాల అనుమతులకు సంబంధించి ఇంకా పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించాల్సి ఉందన్నారు. అనంతరం పూర్తిస్థాయి నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు.

అమ్మవారి హారం ఏమైంది?

... 5వ పేజీ తరువాయి

చేసుకోలేదు. ఈ నెల 22 తేదీన జిల్లా అధికారి సుధారాణి నర్సీపట్నం దేవదాయశాఖ కార్యాలయంలో జేవీవో, ఎప్రైజర్‌ను పిలిపించి మరోసారి నగలు తనిఖీ చేయించారు. హారం గిల్ట్ అని తేలడంతో దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా దేవదాయ శాఖ అధికారిణి సుధారాణి వివరణ కోరగా గిల్ట్ నగ విషయంపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

పరిశ్రమల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

అయినా భద్రత చాలా ముఖ్యం. ప్రభుత్వం ఆదేశించకపోయినా తప్పనిసరిగా భద్రత ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా?...అని చూసుకోవాలి. షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లు, భారీ వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల్లో అప్పుడప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించి, ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్ పనితీరు, ప్రమాదం జరిగితే తప్పించుకునే విధానం వంటివి సిబ్బందికి తెలియజేయాలి. ప్రతి పరిశ్రమలో అన్ని శాఖల అధికారులు కలిసి జాయింట్ సేఫ్టీ ఆడిట్ చేయవచ్చు. దీనికి జిల్లా అధికారి నేతృత్వంలో కమిటీని వేసి, అమలు చేయాలి. ఈ విధానం సరిగ్గా అమలు కావడం లేదు. సమీక్షలు ఉండడం లేదు. ఎసెన్షియా ప్రమాదం తరువాత ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది.

ఇవీ చేయాలి

- ఎసెన్షియాలో ప్రమాదం ఎలా జరిగిందో మూడు రోజులైనా స్పష్టత లేదు. సిబ్బంది చెప్పిందే నమ్మాల్సి వస్తోంది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తరువాత ప్రతి చిన్న వ్యాపార సంస్థ సీసీ టీవీ కెమెరాలు పెట్టుకుంటోంది. కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ 40 ఎకరాల్లో విస్తరించిన ఎసెన్షియాలో ఒక్క సీసీ టీవీ కెమెరా కూడా లేదు. అమరావతి నుంచి సీఎం వెనుక వచ్చిన ఉన్నతాధికారులు దీనిపై ప్రశ్నిస్తే...యాజమాన్య ప్రతినిధులు పొంతన లేని సమాధానాలు చెప్పారు. సీసీ టీవీ కెమెరాలు పెట్టకూడదని సెలవిచ్చారు. ఎందుకు పెట్టకూడదు? ఎవరు చెప్పారు? అంటూ సెక్రటరీ స్థాయి అధికారి ప్రశ్నిస్తే మౌనమే సమాధానం అయింది. పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ అధికారులు కూడా ఇలాంటి అంశాలపై దృష్టిపెట్టలేదు. ఇకపై ప్రతి పరిశ్రమ ఆవరణలో సీసీ టీవీ కెమెరాలు పెట్టేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు.
- పరిశ్రమల్లో పనిచేసే వారికి సేఫ్టీ కిట్లు సరఫరా చేయాలి. హెల్మెట్ లేనిదే లోపలకు అనుమతించకూడదు. అలాగే కాళ్లకు బూట్లు వేసుకోవాలి. ప్రమాదకరమైన వాయువులు పీల్చకుండా నాణ్యమైన మాస్కులు ఉపయోగించాలి. చేతికి గ్లోవ్స్ ఉండాలి. కళ్లకు ఇబ్బంది కలగకుండా గాగుల్స్ ఇవ్వాలి. అయితే ఇవేమీ యాజమాన్యాలు సరఫరా చేయడం లేదు. ఎసెన్షియాలో రసాయనాలన్నీ మండిపోయి ఘాటైన వాసనలు వచ్చాయి. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించడానికి వెళ్లినప్పుడు యాజమాన్యం వారికి సరైన కిట్లను గానీ, నాణ్యమైన మాస్కులు గానీ ఇవ్వలేకపోయింది. ఇలాంటి సంస్థల్లో పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ ప్రత్యేకంగా ఉండాలి. ప్రతి ఉద్యోగికి, విజిటర్లకు కూడా ఇవ్వాలి. కానీ వారు ఆ నిబంధన అమలు చేయడం లేదు. దాంతో చాలామంది ఉద్యోగులు ఆ విషవాయువులు పీల్చి అస్వస్థతకు గురయ్యారు.
- వాయువులు లీకైతే ఆ విషయాన్ని గుర్తించడానికి డిటెక్టర్లు పెట్టాలి.
- రియాక్టర్లలో ప్రెషర్, టెంపరేచర్ గుర్తింపునకు సెన్సార్లతో అనుసంధానం చేయాలి.
- ఎల్‌జీ పాలిమర్స్‌లో ప్రమాదం జరిగినపుడు సైరన్ కూడా మోగించలేదు. దీనిపై అప్పట్లో తీవ్రమైన చర్చ జరిగింది. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే అందరినీ అప్రమత్తం చేయడానికి అలారం/సైరన్ మోగించాలని ఆదేశించారు. ఎసెన్షియాలో కూడా అలారం మోగలేదు. సైరల్ అలర్ట్ చేయలేదు. ఇవన్నీ ప్రాథమిక అంశాలు. వీటిని కూడా అధికారులు అమలు చేయలేకపోతున్నారు.

ఎవరికి వారే..?

జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎంత మంది చనిపోయారు? అని అమరావతి నుంచి వచ్చిన ఉన్నతాధికారి ప్రశ్నించినప్పుడు అన్ని శాఖల అధికారులు తెల్లముఖాలు వేశారు. పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు...ఇలా ఎవరికి వారు తమ దగ్గర డేటా లేదంటే...తమ దగ్గర లేదని సమాధానం ఇచ్చారు. ఇకపై జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఈ సమాచార సేకరణ, నిర్వహణ జరగాలని సూచించారు.

సమాచారం ఇవ్వకుండానే చికిత్సలు

ఎసెన్షియాలో ప్రమాదం జరిగిన రెండో రోజే పరవాడలోని రాంకీ ఫార్మాసిటీలోని సినర్జిన్ కంపెనీలో రియాక్టర్ వద్ద ప్రమాదం జరిగింది. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అధికారులకు తెలియజేయకుండానే బాధితులను ఆస్పత్రికి తరలించారు. కొన్ని గంటల తరువాత ఈ విషయం ప్రజా ప్రతినిధుల దృష్టికి రావడంతో అధికారులను ప్రశ్నించారు. వారు మళ్లీ తెల్లముఖం వేశారు. పరిశ్రమలు, ప్రభుత్వానికి మధ్య కమ్యూనికేషన్ లేదని, బాధ్యతగా వ్యవహరించడం లేదని గుర్తించి హెచ్చరికలు చేశారు. ఏ ఆస్పత్రి అయినా సరే ఇలాంటి కేసులు వచ్చినపుడు చికిత్స ప్రారంభిస్తూనే జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

రోడ్లు చెరువులాయె..

- రెండు మండలాల్లో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఎలమంచిలి కాలువల్లో పూడికలు తీయించినా ఫ్ట్...

ఎలమంచిలి/ అచ్యుతాపురం, ఆగస్టు 24 : వాతావరణంలో మార్పుల కారణంగా శనివారం ఎలమంచిలి, అచ్యుతాపురం తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మబ్బు వాతావరణం ఉన్నప్పటికీ పదిన్నర గంటల ప్రాం తంలో కుండపోతగా వాన పడింది. దీంతో ఎలమంచిలి పట్టణంలోని రోడ్లు జలమయం అయ్యాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రధాన డ్రైన్‌లలో పూడికతీత పనులు చేపట్టినా రోడ్లపైకి నుంచి నీరుచేరింది. పనులు మొక్కుడిగా చేపట్టడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, మిలట్రీ కాలనీ కొత్తపేట ప్రధాన రోడ్డు, యర్రవరం ప్రధాన రోడ్డు, జలాలు వీధి రోడ్డు, సైతారు పేట రోడ్డు వంటి ప్రాంతాల్లోని భారీగా నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొన్నారు. అలాగే, అచ్యుతాపురం మండలంలో ఉదయం పదిన్నర గంటలప్రాంతంలో సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు ఏరులాపారింది. ఎస్‌టీబీఎల్ కాలనీకి వెళ్లే రోడ్డు బురదనీటితో నిండిపోయింది.



ఎలమంచిలి పట్టణంలో రోడ్డుపైకి చేరిన మురుగు, వర్షపు నీరు



అచ్యుతాపురంలో వర్షపు నీటితో నిండిన ఎస్‌టీబీఎల్ కాలనీ రోడ్డు

ఒకటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

- అంతా విజయవంతం చేయండి : ఎంపీ సీఎం రమేష్

కొత్తూరు, ఆగస్టు 24 : వచ్చే నెల ఒకటో తేదీనుంచి జరగనున్న బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదుపైఅనకాపల్లిలో శనివారం జిల్లా కార్యవర్గం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశంలోనే మొదటి స్థానంలో ఉండేలా బీజేపీ సభ్యత్వ నమోదును ఈసారి మరింత రెట్టింపు కావాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులైన ఆయా కుటుంబ సభ్యులను సభ్యులుగా చేర్పించాలని కోరారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రధానంగా జిల్లా సమగ్రాభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలన్నీ ప్రత్యేకంగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్లమెంటు కన్వీనర్ డీవీఎస్ వర్మతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేష్

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తులతో నిరసన

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 : కోల్‌కతాలో జరిగిన దారుణ సంఘటనకు నిరసనగా అనకాపల్లిలో వాసవిక్లబ్ వనిత ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి గుడి జంక్షన్‌లో శనివారం రాత్రి మహిళలు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని ఈ సందర్భంగా వాసవిక్లబ్ వనిత అధ్యక్షులు జంగాల ఫణి మాట్లాడుతూ కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని, వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన చాలా దురదృష్టకరమని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా సరైన చట్టాలు తీసుకురావాలని కోరారు. కార్యదర్శి జి.సువర్ణ, కోశాధికారి డి.సునీత, వాసవి క్లబ్ వనిత సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో మహిళలు నిరసన ప్రదర్శన

'గ్రామ స్వరాజ్య సాధనే ప్రభుత్వ లక్ష్యం'

సబ్బవరం, ఆగస్టు 24 : రాష్ట్రంలో గ్రామ స్వరాజ్య సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. మండలంలోని మొగలిపురంలో సర్పంచ్ గండి అరుణ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా గ్రామాల సమగ్రాభివృద్ధికి అధికారులు పనిచేయాలన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పూర్తిగా నాశనం చేసిందన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చేదిగా కూటమి ప్రభుత్వం బాధ్యతతో పనిచేస్తుందన్నారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, కాంపౌండ్ వాల్స్, పశువుల షెడ్లు, పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం వంటి సుమారు 70 రకాల పనులు గుర్తించినట్టు కార్యదర్శి సంతోషి తెలిపారు. మండల ఇంజనీర్ అర్జునఅప్పారావు, సర్పంచ్ గండి అరుణ, ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, సీనియర్ టీడీపీ నేతలు తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మొగలిపురం సభలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



తాళ్లపాలెం పాఠశాలలో పిల్లల సందడి



'పేట' శ్రీప్రకాష్ విద్యా సంస్థలో..

కృష్ణాష్టమి వేడుకలను శనివారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో, నక్కపల్లి గురు స్కూల్‌లో, కశింకోట మండలం తాళ్లపాలెం గాయత్రి హైస్కూల్‌లో వేడుకలు సందడిగా సాగాయి. -పాయకరావుపేట/నక్కపల్లి/కశింకోట



నక్కపల్లిలోని పాఠశాలలో చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలతో అలరిస్తున్న పిల్లలు

టీడీపీలో కష్టపడే వారికి గుర్తింపు : ప్రగడ



పార్టీ శ్రేణులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రగడ

అచ్యుతాపురం, ఆగస్టు 24 : టీడీపీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇక్కడి కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలో గల పన్నెండు మంది పార్టీ కార్యకర్తలకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పంపిన ప్రశంసా పత్రాలను వారికి అందజేసి మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు ఈ పన్నెండు మంది టీడీపీ యాప్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారన్నారు. వీరి సేవలను చంద్రబాబు గుర్తించి ప్రశంసా పత్రాలను పంపినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మాల ఆదిరెడ్డి, కొటారు దల్లమ్మదేవి, చెల్లూరి కోదండరావు, గుర్రం గణేష్, కాండ్రేగుల రాంప్రసాద్, దాడి వేంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు వార్డుల్లో కుళాయిలు బంద్

ఎలమంచిలి, ఆగస్టు 24 : పట్టణంలోని కొన్ని వార్డుల్లో ఆదివారం తాగునీటి కుళాయిలు బంద్ కానున్నాయని అధికారులు తెలిపారు. మునిసిపాలిటీకి తాగునీటి వనరులైన ఎస్.రాయవరం మండలం సోముదేవుపల్లి వద్ద గల భారీ నీటిపథకం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఈ అసౌకర్యం తలెత్తనుందన్నారు. ఈ కారణంగా 9, 10 వార్డులతో పాటు క్లబ్ రోడ్డు, ధర్మవరం, భావనాబుషి ప్రాంతాల్లోని కుళాయిల ద్వారా నీరు రావదని, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని వివరించారు.

వినాయక ఘాట్‌ను పరిశీలించిన జెడ్సీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 : పట్టణంలోని శారదా నది ఒడ్డున గల వినాయక నిమజ్జన ఘాట్‌లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు. వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి శనివారం ఆయన నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. ఘాట్‌ను అభివృద్ధి పరుస్తామని, పరిశుభ్రతకు ప్రాధాన్యతం ఇస్తామని, వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తెచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆడారి కుమారస్వామి, కమిటీ ప్రతినిధులు కొడుకుల శ్రీకాంత్, కె.హరినాథబాబు, పి.వరప్రసాద్, కె.భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

సబ్బవరం, ఆగస్టు 24 : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ స్టార్టప్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని తద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రిసోర్స్‌పర్సన్ వసంత పట్నాయక్, కామర్స్ విభాగం హెచ్‌వోడీ ఎం.గోవిందరావు, సిబ్బంది డాక్టర్ ఎస్.సత్యనారాయణ, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో అధునాతన ఆస్పత్రి అవసరం

... 5వ పేజీ తరువాయి

మండలం తానాంలో కాల్వ నిర్మాణంలో అవకతవకలపై జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని జలవనరుల శాఖ ఈఈ త్రినాథరావును చైర్‌పర్సన్ ఆదేశించారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ సామాజిక పింఛన్ల కోత పేరిట సర్వేచేస్తున్నారని ఫిర్యాదుచేయగా, డీఆర్‌డీఏ అధికారులు వివరణ ఇస్తూ అనర్హులుంటే తొలగిస్తాం తప్ప అర్హులకు ఇబ్బంది లేదని పేర్కొన్నారు. కాగా ఏజెన్సీలో వాణిజ్యపంటలను ప్రోత్సహించాలని అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కోరగా కాఫీ, మిరియాలు, సిల్వర్ ఓక్ చెట్ల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని సంబంధిత అధికారులను సుభద్ర ఆదేశించారు.

కేజీహెచ్‌లో ఇద్దరు పీఆర్వోలు

కేజీహెచ్‌లో వైద్య సేవలు మెరుగుపడ్డాయని చైర్‌పర్సన్ సుభద్రతో పాటు సభ్యులు ప్రశంసించారు. అయితే వైద్యం కోసం వచ్చే వారికి పూర్తి వివరాలు చెప్పాలని కోరారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద బదులిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తాను అందుబాటులో ఉంటున్నారన్నారు. ఇంకా మరింత సేవల కోసం కేజీహెచ్‌లో ఇద్దరు పీఆర్వోలను నియమించామని, వారికి సంబంధించి ఫోన్ నంబర్లు 7569898151, 9030243861లో సంప్రతించాలని కోరారు. కేజీహెచ్‌లో వైద్యం కోసం ఎవరైనా డబ్బులు అడిగితే కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0891- 2590100, 0891-2590102కు ఫిర్యాదు చేయాలని సూచించారు. స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో 3, 5, 6 స్టాండింగ్ సమావేశాలు నిర్వహించారు.

'ఫార్మా'ల్లో కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

- వరుస ప్రమాదాలపై సీఐటీయూ ఆందోళన

పరవాడ (లంకెలపాలెం), ఆగస్టు 24 : ఫార్మా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం లంకెలపాలెం - పరవాడ మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా, ఫార్మాసిటీలోని సినర్జిన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 17 మంది ప్రాణాలను బలిగొన్న ఎసెన్షియా ఫార్మా యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం వల్లే తరుచూ ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వి.వి.శ్రీనివాసరావు, కరణం వెంకటరావు, లక్ష్మణరావు, సంతోష్, రమేష్, నాగరాజు, దేవకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'మృతుని కుటుంబానికి రూ. కోటి పరిహారం చెల్లించాలి'

పరవాడ : ఇక్కడి సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యూనిట్-3లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన హెల్పర్ రోయా అంగరియా కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడని ఆరోపించారు. వలస కార్మికులకు సౌకర్యాలు కల్పించడంలో ఇటు యాజమాన్యం, అటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగతా ముగ్గురికి మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండుగ



నక్కపల్లి, ఆగస్టు 24 : ఉపమాక శివారు శీనయ్యపాలెంలో సత్తెమ్మతల్లి పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారు వెలసిన చెట్టు వద్ద, ఆలయంలో విగ్రహం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబు, జగదీశ్వరరావు, తోలేటి శ్రీను, వాసు, చెల్లారావు, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామి ఆలయం పునః ప్రారంభం



ఆలయాన్ని పునః ప్రారంభిస్తున్న కొణతాలు, పీలా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 : గవరపాలెం దిబ్బ వీధిలో పునర్నిర్మించిన నాగేంద్రస్వామి, కల్యాణ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని శనివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కొబ్బరితోటలో ఏర్పాటు చేసిన యాగశాలలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని అర్చకులు కొడుకుల సుబ్రహ్మణశర్మ ఆధ్వర్యంలో నేత్రపర్వంగా నిర్వహించారు. యల్లపు సత్యనారాయణ దంపతులు, మల్లేశ్వరరావు దంపతులు కల్యాణం జరిపారు. ఆలయ నిర్మాణానికి ముఖ్య విరాళదాత దొడ్డి వెంకట సత్యనారాయణను ఎమ్మెల్యే సత్కరించారు. ఆలయ చైర్మన్ బొడ్డేడ రోషన్ కుమార్, కోశాధికారి కొణతాల త్రినాథరావు, కమిటీ సభ్యులు మద్దాల క్రాంతికుమార్, శరగడం శివాజీ, మళ్ల జగదీష్, దాడి వాసు, పీలా గిరి, మళ్ల చైతన్య పాల్గొనారు.

అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్‌గా జగన్ : బుద్ద



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద

తుమ్మపాల, ఆగస్టు 24 : అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్‌గా మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తయారయ్యారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు విమర్శించారు. శనివారం అనకాపల్లి టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాద ఘటనలో బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అన్నివిధాలుగా అండగా నిలిస్తే, జగన్‌రెడ్డి మాత్రం నిసిగ్గుగా దుష్ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పార్టీ నాయకులు కోట్ని రామకృష్ణదొర, కాండ్రేగుల సత్యనారాయణ, మళ్ల శివన్నారాయణ, దూలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెజ్ కర్మాగారాల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి

అచ్యుతాపురం, ఆగస్టు 24 : సెజ్‌లోని అన్ని కర్మాగారాల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. 17 మంది కార్మికుల ప్రాణాలు బలిగొన్న ఎసెన్షియా కర్మాగారం యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూండ్రపు సోమునాయుడు, రాజు, చందు, మోహన్ పాల్గొన్నారు.

'చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయ్ కుమార్

ఎలమంచిలి, ఆగస్టు 24 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని పాఠశాలల విద్యా సంచాలకులు బి.విజయ్ కుమార్ సూచించారు. పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్ ఆవరణలో మండలంలోని ఉపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలన్నారు. డిప్యూటీ డీఈవో అప్పారావు, ఎంఈవో మీనాక్షి పాల్గొన్నారు.

'కూటమి' రాకతో కర్మాగారాల ఏర్పాటుకు పోటీ

అచ్యుతాపురం ఆగస్టు 24 : యువత స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. శనివారం అప్పన్నపాలెంలో మినీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సెజ్‌లో ఒక్క కర్మాగారం కూడా రాకపోవడంతో యువతకు ఉపాధి అవకాశాలు కలగలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇక్కడ కర్మాగారాల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు పోటీ పడుతున్నారు. బైలపూడి శ్రీరామదాసు, డ్రీమ్స్ నాయుడు, లాలం శ్రీను, ద్వారపురెడ్డి బాపూజీ, గిరి, బాష తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారం ఏర్పాటుకు అనుమతులు వద్దు

సబ్బవరం, ఆగస్టు 24 : మండల కేంద్రం సబ్బవరం, శివారు గ్రామాల్లో కోళ్ల ఫారాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని వార్డు సభ్యులు కొల్లి దేముడమ్మ, టి.శేఖర్ తదితరులు శనివారం కార్యదర్శి మూర్తిబాబును కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. మేజర్ పంచాయతీ సబ్బవరంలో అధికంగా ప్రజలు నివశి స్తున్నారన్నారు. కోళ్ల ఫారాల ఏర్పాటు వలన దోమలు విజృంభిస్తున్నాయన్నారు.

సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బందికి అవగాహన

తుమ్మపాల/కశింకోట, ఆగస్టు 24: ఇక్కడి పీహెచ్‌సీని జోనల్ మలేరియా అధికారిణి డాక్టర్ శాంతిప్రభ శనివారం సందర్శించారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వాణి జగదీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు. కశింకోట మండలం తాళ్లపాలెం పీహెచ్‌సీని డాక్టర్ శాంతిప్రభ సందర్శించారు. జోనల్ మలేరియా విభాగం విస్తరణాధికారి తిరుపతిరావు, ప్రధాన వైద్యాధికారి యు.రమేష్ పాల్గొన్నారు.

16 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 24 : మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. జంగాలపాలేనికి చెందిన చిన్నారావు అనే వ్యక్తి పదహారు మద్యం బాటిళ్లను శనివారం అనకాపల్లిలో కొనుగోలు చేసి తరలిస్తున్నాడన్నారు. శారదా బ్రిడ్జి వద్ద అనుమానం వచ్చి తనిఖీ చేయగా సీసాలు పట్టుబడినట్టు చెప్పారు. స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

చెరకు రైతులకు రాయితీపై గడ్డి మందులు

» సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు



రైతులకు గడ్డి మందులు అందజేస్తున్న శ్రీనివాసరావు

చోడవరం, ఆగస్టు 24 : గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని సభ్య రైతులకు రాయితీ ధరలపై గడ్డి మందులు సరఫరా ప్రారంభించినట్టు చోడవరం చెరకు అభివృద్ధి మండలి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు తెలిపారు. రైతులకు అందుబాటులో రెండు రకాల గడ్డి మందులు వందగ్రాముల ప్యాకెట్ రూ.96, అర కిలో ప్యాకెట్ 2 ఫోర్ డీ రకం మందు రూ.122కు విక్రయిస్తున్నామన్నారు. ఆరు వందల బ్యాగులు గెమాక్సిన్ మందు 5 కిలోల బ్యాగు తగ్గింపు ధరలో రూ.101కు అందుబాటులో ఉన్నాయన్నారు. మోనోక్రోన్ పావు లీటరు రూ.96కు రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. సభ్య రైతులు రాయితీ ధరలకు పురుగుమందులు, గడ్డి మందులు వినియోగించుకోవాలని సీడీసీ చైర్మన్ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

» కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న రాజ్‌కుమార్

బుచ్చెయ్యపేట, ఆగస్టు 24 : సమగ్ర పోషక యాజమాన్యంతో అధిక దిగుబడులను సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం (కొండెంపూడి) ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్ అన్నారు. ఆయన శనివారం దిబ్బిడిలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 40 రోజులు పైబడిన ముదురు వరినారును దగ్గర దగ్గరగా కుదురుకు 8 మొక్కలు ఉండేటట్టు నాటుకోవాలన్నారు. ఎరువుల యాజమాన్యంలో నత్రజని ఎరువులను సిఫార్సు కంటే 25 శాతం అధికంగా వినియోగించాలన్నారు. స్వల్పకాలిక రకం వరి నారు ముదిరితే నాటవద్దని రైతులకు సూచించారు. కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త సత్తిబాబు కూరగాయల సాగులో చేపట్టవలసిన మెలకులను రైతులకు వివరించారు. ప్రస్తుతం పరిశోధన కేంద్రంలో లభిస్తున్న కూరగాయల నారు వివరాలను తెలిపారు. పెరట్లో పెంపకానికి ఉచితంగా నారు అందజేస్తామని సత్తిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఏడీ ఎ.శ్రీధర్, చోడవరం ఏడీఏ వి.రవీంద్రనాథ్, మండల ఏవో భాస్కరరావు, డీఆర్సీ ఏవో పి.వి జేత, వీఏఏ వరప్రసాద్, ఏఈవో వాణి, రైతులు పాల్గొన్నారు.

5 శాతం రిజర్వేషన్ కల్పించాలి : రెల్లి కులస్థుల డిమాండ్



ఏఎల్‌పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నేతలు, రెల్లి కులస్థులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 24 : ఎస్సీ రిజర్వేషన్‌లో తమకు ఐదు శాతం అవకాశం కల్పించాలని కోరతూ గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో రెల్లి కులస్థులు శనివారం ప్రధాన రహదారిపై ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 5 శాతం రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి అప్పన్నబాబు, మజ్జి సత్యనారాయణ, బంగారు బాబ్జీ, కృష్ణ, శివ, కుమార్‌స్వామి, చినబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



యశోద, రాధాకృష్ణుల వేషధారణలో విద్యార్థులు

మాకవరపాలెం, ఆగస్టు 24 : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విద్యార్థులు మోహన్, రేవంత్ చిన్నికృష్ణుడు, గోపిక వేషధారణలో అలరించారు. అనంతరం ప్రవీణ్‌కుమార్ అనే విద్యార్థి ఉట్టిని కొట్టాడు. కృష్ణాష్టమి విశిష్టను ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము వివరించారు. కార్యక్రమంలో లోవరాజు, సంతోషి, టీచర్లు పాల్గొన్నారు.


వడ్డాదిలో రూ.70 వేలు చోరీ

బుచ్చెయ్యపేట, ఆగస్టు 24 : వడ్డాది ఎస్సీ కాలనీలో జరిగిన చోరీలో రూ.70 వేలు, రెండు టచ్ సెల్‌ఫోన్‌లను గుర్తుతెలియని దొంగలు దోచుకుపోయారు. శుక్రవారం రాత్రి కోరుకొండ నాగరాజు ఇంట్లో దొంగలు ప్రవేశించి చోరీకి పాల్పడినట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

బస్ షెల్టర్ కూల్చివేతపై కేసు నమోదు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 24 : వడ్డాదిలో బస్ షెల్టర్ కూల్చివేతపై గ్రామ పంచాయతీ ఈవో లవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. బీఎన్ రోడ్డులో వెంకటేశ్వరస్వామి ఆర్చ్ ఎదురుగా గతంలో నిర్మించిన బస్ షెల్టర్‌ను సయ్యపురెడ్డి భాస్కరరావు శనివారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశాడని ఈవో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాండవ కుడికాలువ అక్విడెక్టుకు లీకేజీ



అక్విడెక్టుకు రంధ్రం ఏర్పడడంతో సాగునీరు వృథాగా పోతున్న ప్రాంతం (వృత్తంలో)

నాతవరం, ఆగస్టు 24 : మండలంలోని గుమ్మిడిగొండ సమీపంలోని కుడికాలువ అక్విడెక్టు (బండారు తాతకట్టు)కు రంధ్రం ఏర్పడడంతో సాగునీరు కొండగెడ్డల ద్వారా తాండవ నదిలోకి వృథాగా పోతోంది. దీనివల్ల నాలుగొంతుల నీరు దిగువ ప్రాంతాల పొలాలకు వెళుతుండగా, ఒక వంతు నీరు ఇక్కడ అక్విడెక్టు రంధ్రం నుంచి పోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్విడెక్టుకు మరమ్మతుకు చేపట్టకుంటే కుడి కాలువకు గండిపడి పెద్ద సమస్యగా మారుతుందని గుమ్మిడిగొండ, చిన్నయ్యపాలెం కొత్తగూడెం తదితర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. కుడికాలువ అక్విడెక్టు దగ్గర సాగునీరు వృథాగా పోతున్న విషయాన్ని తాండవ డీఈఈ అనురాధ వద్ద ప్రస్తావించగా, వెంటనే వెళ్లి పరిశీలిస్తామని తెలిపారు.

అధికారులు వెంటనే స్పందించాలి

- గాది జమీలు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు, గుమ్మిడిగొండ

కుడి కాలువ అక్విడెక్టు వద్ద మూడేళ్ళ నుంచి పరిస్థితి అధ్వానంగా ఉంది. దట్టంగా తుప్పలు పెరిగిపోవడంతో ఆ ప్రాంతం చిట్టడవిని తలపిస్తోంది. ఉపాధి హామీ పనుల్లో కూడా ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టలేదు. మూడేళ్ళ క్రితం ఇక్కడ అక్విడెక్టు దెబ్బతిని సాగునీరు కొంతకాలం నిలిచిపోవడంతో అప్పట్లో తాత్కాలిక పనులు చేపట్టారు. ఇప్పుడు పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చేలా ఉంది. వెంటనే ఇక్కడ లీకేజీలను అరికట్టి గండి పడకుండా పూర్తిస్థాయి పనులు చేపట్టాలి.

14న జాతీయ లోక్ అదాలత్

» సివిల్ జడ్జి పటాన్ షియాజ్‌ఖాన్



మాట్లాడుతున్న జడ్జి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం, ఆగస్టు 24 : సెప్టెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పటాన్ షియాజ్‌ఖాన్ అన్నారు. శనివారం కోర్టు సముదాయంలో పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. రాజీ పడదగ్గ కేసులు ఉంటే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని సూచించారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు సివిల్ జడ్జి ఎం.రోహిత్ పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యతపై టీడీపీ నేతల ఫిర్యాదు



ఎన్.గదబపాలెం రోడ్డును పరిశీలిస్తున్న వార్డు సభ్యులు

గొలుగొండ, ఆగస్టు 24 : రోడ్డు నిర్మాణం చేపట్టి ఎనిమిది నెలలు గడవకముందే తారురోడ్డు శిథిలావస్థకు చేరిందంటూ పాతమల్లంపేట టీడీపీ వార్డు సభ్యులు చీమల రాములు, గోరా దేముడు, టీడీపీ నాయకుడు గెడ్డం నానాజీ ఆరోపించారు. మండలంలోని పాతమల్లంపేట పంచాయతీలోని ఎన్.గదబపాలెం నుంచి నిమ్మగెడ్డ మధ్య నాబార్డు నిధుల నుంచి రూ.60 లక్షలతో వైసీపీ ప్రభుత్వ హయాంలో తారు రోడ్డు వేశారు. ఈ రోడ్డును టీడీపీ నేతలు శుక్రవారం పరిశీలించి నాణ్యత లేదంటూ విమర్శించారు. ఎనిమిది నెలలు కాకుండానే పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయంటూ ఆరోపించారు. రోడ్డు పనులు అసంతృప్తిగా ఉన్నాయన్నారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

అడ్డసరంలో 'పొలంబడి'



ద్రవ జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీదేవి

రోలుగుంట, ఆగస్టు 24 : రైతులు సాగులో మేలైన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని నర్సీపట్నం ఏడీఏ టి.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అడ్డసరంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులకు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లో సభ్యులుగా చేర్పించడం, పండిన పంటకు సర్టిఫికెట్ చేయడం, పండిన పంటకు సర్టిఫికేషన్ అయిన పంటను ఆన్‌లైన్ ద్వారా అమ్ముకోవడం తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా ద్రవ జీవామృతం తయారీపై అవగాహన కల్పించి తయారీ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో విజయలక్ష్మి, జీపీపీ పొలం బడి మాస్టర్ ట్రైనర్ చిరంజీవి, ఎప్‌పీవో రమణ పాల్గొన్నారు.

అమ్మవారి హారం ఏమైంది?

... 5వ పేజీ తరువాయి

చేసుకోలేదు. ఈ నెల 22 తేదీన జిల్లా అధికారి సుధారాణి నర్సీపట్నం దేవదాయశాఖ కార్యాలయంలో జేవీవో, ఎప్రైజర్‌ను పిలిపించి మరోసారి నగలు తనిఖీ చేయించారు. హారం గిల్ట్ అని తేలడంతో దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా దేవదాయ శాఖ అధికారిణి సుధారాణి వివరణ కోరగా గిల్ట్ నగ విషయంపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

పలు ప్రాంతాల్లో వర్షం

వరి పంటకు మేలు అంటున్న రైతులు



నర్సీపట్నంలో కురుస్తున్న వర్షం



మాకవరపాలెంలో వాన

కృష్ణాదేవిపేట, ఆగస్టు 24 : గొలుగొండ మండలంలో గల ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో శనివారం భారీ వర్షం పడింది. దీంతో మూడురోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలకు కొంతమేరకు ఉపశమనం పొందా రు. ఈ వర్షంతో రైతులు వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఏడాది కురిసిన వర్షాలకు ఖరీఫ్ వరిసాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు. అయితే ఈ భారీ వర్షంతో డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రవహించింది. రోడ్లు చిత్తడిగా తయారయ్యాయి.

మాకవరపాలెం : మండలంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక మోస్తారు వర్షం పడింది. గత వారం రోజులుగా ఎండలు మండుతుండడంతో శనివారం కరిసిన వర్షానికి రైతు లు ఆనందం వ్యక్తంచేశారు. మెట్ట ప్రాంతాల్లో ఎండలు వల్ల వరిసాగు చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే ఈ వర్షం వరినాట్లకు ఉపయోగ పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నర్సీపట్నం : నర్సీపట్నంలో మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయం 9 గంటల నుంచి రెండున్నర గంటలు సేపు ఎడతురిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

గొలుగొండ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జోగంపేట, గొలుగొండ, పాకలపాడు, ఏటిగైరంపేట, సాలికమల్లవరం, పాతమల్లంపేట, కొత్తమల్లంపేట, కొత్తఎల్లవరం, గుండుపాల గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో మెరక పొలాల్లో వరి నాట్లకు ఎంతగానో వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల : మండల కేంద్రంలో శనివారం ఉదయం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం పదిన్నర గంటల వరకు వాతావరణం పొడిగా ఉంది అనంతరం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి కారుమేఘాలు అలముకున్నాయి. వర్షం కురిసి వాతావరణం చల్లబడటంతో పాటు వ్యవసాయ పంట పొలాల్లోకి నీరు చేరింది. దీంతో రైతు ఆనందం వ్యక్తం చేశారు. ఇదేమాదిరిగా అడపాదడపా వర్షాలు కురిస్తే వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు.

మాడుగుల రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం పొడిగానే ఉంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి ఆకాశమంతా మేఘావృతమై తేలికపాటి జల్లులతో ఆరంభమై మోస్తరు వర్షం పడింది. వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు.

చీడికాడ : మండల కేంద్రం చీడికాడతో పాటు పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రతిరోజు మధ్యాహ్న సమయంలో వర్షం కురవగా శనివారం ఉదయం నుంచి వర్షం కురవడంతో మెట్ట ప్రాంతాల్లో వరినాట్లు వేసే రైతులు ఆనందం వ్యక్తంచేశారు. మొత్తంగా ఈ వర్షం అందరికీ ఉపయోగమని రైతులు తెలిపారు.

5 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందే

రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు



మాట్లాడుతున్న పాపారావు

నర్సీపట్నం, ఆగస్టు 24 : రెల్లి కులస్థులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించకుంటే భారీ ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు అన్నారు. శనివారం చెట్టుపల్లిలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో అట్టడుగున ఉన్న రెల్లి కులస్థులను 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు రెల్లి కులస్థులను అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రిషికుమార్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో అధునాతన ఆస్పత్రి అవసరం

... 5వ పేజీ తరువాయి

మండలం తానాంలో కాల్వ నిర్మాణంలో అవకతవకలపై జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని జలవనరుల శాఖ ఈఈ త్రినాథరావును చైర్‌పర్సన్ ఆదేశించారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ సామాజిక పింఛన్ల కోత పేరిట సర్వేచేస్తున్నారని ఫిర్యాదుచేయగా, డీఆర్‌డీఏ అధికారులు వివరణ ఇస్తూ అనర్హులుంటే తొలగిస్తాం తప్ప అర్హులకు ఇబ్బంది లేదని పేర్కొన్నారు. కాగా ఏజెన్సీలో వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కోరగా కాఫీ, మిరియాలు, సిల్వర్ ఓక్ చెట్ల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని సంబంధిత అధికారులను సుభద్ర ఆదేశించారు.

కేజీహెచ్‌లో ఇద్దరు పీఆర్వోలు

కేజీహెచ్‌లో వైద్య సేవలు మెరుగుపడ్డాయని చైర్‌పర్సన్ సుభద్రతో పాటు సభ్యులు ప్రశంసించారు. అయితే వైద్యం కోసం వచ్చే వారికి పూర్తి వివరాలు చెప్పాలని కోరారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద బదులిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తాను అందుబాటులో ఉంటున్నారన్నారు. ఇంకా మరింత సేవల కోసం కేజీహెచ్‌లో ఇద్దరు పీఆర్వోలను నియమించామని, వారికి సంబంధించి ఫోన్ నంబర్లు 7569898151, 9030243861లో సంప్రతించాలని కోరారు. కేజీహెచ్‌లో వైద్యం కోసం ఎవరైనా డబ్బులు అడిగితే కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0891-2590100, 0891-2590102కు ఫిర్యాదు చేయాలని సూచించారు. స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో 3, 5, 6 స్టాండింగ్ సమావేశాలు నిర్వహించారు.

పరిశ్రమల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

అయినా భద్రత చాలా ముఖ్యం. ప్రభుత్వం ఆదేశించకపోయినా తప్పనిసరిగా భద్రత ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా?...అని చూసుకోవాలి. షాపింగ్‌మాల్స్ సినిమా థియేటర్లు, భారీ వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల్లో అప్పుడప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించి, ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్ పనితీరు, ప్రమాదం జరిగితే తప్పించుకునే విధానం వంటివి సిబ్బందికి తెలియజేయాలి. ప్రతి పరిశ్రమలో అన్ని శాఖల అధికారులు కలిసి జాయింట్ సేఫ్టీ ఆడిట్ చేయవచ్చు. దీనికి జిల్లా అధికారి నేతృత్వంలో కమిటీని వేసి, అమలు చేయాలి. ఈ విధానం సరిగ్గా అమలు కావడం లేదు. సమీక్షలు ఉండడం లేదు. ఎసెన్షియా ప్రమాదం తరువాత ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది.

ఇవీ చేయాలి

- ఎసెన్షియాలో ప్రమాదం ఎలా జరిగిందో మూడు రోజులైనా స్పష్టత లేదు. సిబ్బంది చెప్పిందే నమ్మాల్సి వస్తోంది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తరువాత ప్రతి చిన్న వ్యాపార సంస్థ సీసీ టీవీ కెమెరాలు పెట్టుకుంటోంది. కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ 40 ఎకరాల్లో విస్తరించిన ఎసెన్షియాలో ఒక్క సీసీ టీవీ కెమెరా కూడా లేదు. అమరావతి నుంచి సీఎం వెనుక వచ్చిన ఉన్నతాధికారులు దీనిపై ప్రశ్నిస్తే...యాజమాన్య ప్రతినిధులు పొంతన లేని సమాధానాలు చెప్పారు. సీసీ టీవీ కెమెరాలు పెట్టకూడదని సెలవిచ్చారు. ఎందుకు పెట్టకూడదు? ఎవరు చెప్పారు? అంటూ సెక్రటరీ స్థాయి అధికారి ప్రశ్నిస్తే మౌనమే సమాధానం అయింది. పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ అధికారులు కూడా ఇలాంటి అంశాలపై దృష్టిపెట్టలేదు. ఇకపై ప్రతి పరిశ్రమ ఆవరణలో సీసీ టీవీ కెమెరాలు పెట్టేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు.
- పరిశ్రమల్లో పనిచేసే వారికి సేఫ్టీ కిట్లు సరఫరా చేయాలి. హెల్మెట్ లేనిదే లోపలకు అనుయతించకూడదు. అలాగే కాళ్లకు బూట్లు వేసుకోవాలి. ప్రమాదకరమైన వాయువులు పీల్చకుండా నాణ్యమైన మాస్కులు ఉపయోగించాలి. చేతికి గ్లోవ్స్ ఉండాలి. కళ్లకు ఇబ్బంది కలగకుంగా గాగుల్స్ ఇవ్వాలి. అయితే ఇవేమీ యాజమాన్యాలు సరఫరా చేయడం లేదు. ఎసెన్షియాలో రసాయనాలన్నీ మండిపోయి ఘాటైన వాసనలు వచ్చాయి. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించడానికి వెళ్లినప్పుడు యాజమాన్యం వారికి సరైన కిట్లను గానీ, నాణ్యమైన మాస్కులు గానీ ఇవ్వలేకపోయింది. ఇలాంటి సంస్థల్లో పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ ప్రత్యేకంగా ఉండాలి. ప్రతి ఉద్యోగికి, విజిటర్లకు కూడా ఇవ్వాలి. కానీ వారు ఆ నిబంధన అమలు చేయడంలేదు. దాంతో చాలామంది ఉద్యోగులు విషవాయువులు పీల్చిఅస్వస్థతకు గురయ్యారు.
- వాయువులు లీకైతే ఆ విషయాన్ని గుర్తించడానికి డిటెక్టర్లు పెట్టాలి.
- రియాక్టర్లలో ప్రెషర్, టెంపరేచర్ గుర్తింపునకు సెన్సార్లతో అనుసంధానం చేయాలి.
- ఎల్‌జీ పాలిమర్స్‌లో ప్రమాదం జరిగినపుడు సైరన్ కూడా మోగించలేదు. దీనిపై అప్పట్లో తీవ్రమైన చర్చ జరిగింది. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే అందరినీ అప్రమత్తం చేయడానికి అలారం/సైరన్ మోగించాలని ఆదేశించారు. ఎసెన్షియాలో కూడా అలారం మోగలేదు. సైరల్ అలర్ట్ చేయలేదు. ఇవన్నీ ప్రాథమిక అంశాలు. వీటిని కూడా అధికారులు అమలు చేయలేకపోతున్నారు.

ఎవరికి వారే..?

జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎంత మంది చనిపోయారు? అని అమరావతి నుంచి వచ్చిన ఉన్నతాధికారి ప్రశ్నించినప్పుడు అన్ని శాఖల అధికారులు తెల్లముఖాలు వేశారు. పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు...ఇలా ఎవరికి వారు తమ దగ్గర డేటా లేదంటే...తమ దగ్గర లేదని సమాధానం ఇచ్చారు. ఇకపై జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఈ సమాచార సేకరణ, నిర్వహణ జరగాలని సూచించారు.

సమాచారం ఇవ్వకుండానే చికిత్సలు

ఎసెన్షియాలో ప్రమాదం జరిగిన రెండో రోజే పరవాడలోని రాంకీ ఫార్మాసిటీలోని సినర్జీస్ కంపెనీలో రియాక్టర్ వద్ద ప్రమాదం జరిగింది. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అధికారులకు తెలియజేయకుండానే బాధితులను ఆస్పత్రికి తరలించారు. కొన్ని గంటల తరువాత ఈ విషయం ప్రజా ప్రతినిధుల దృష్టికి రావడంతో అధికారులను ప్రశ్నించారు. వారు మళ్లీ తెల్లముఖం వేశారు. పరిశ్రమలు, ప్రభుత్వానికి మధ్య కమ్యూనికేషన్ లేదని, బాధ్యతగా వ్యవహరించడం లేదని గుర్తించి హెచ్చరికలు చేశారు. ఏ ఆస్పత్రి అయినా సరే ఇలాంటి కేసులు వచ్చినపుడు చికిత్స ప్రారంభిస్తూనే జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

☛ సంక్షిప్తంగా..

25 గోకులం షెడ్లు మంజూరు

రోలుగుంట, ఆగస్టు 24 : మండలానికి 25 గోకులం షెడ్లు మంజూరు అయినట్టు రోలుగుంట పశువైద్యాధికారి డా.నూకేశ్వరరావు తెలిపారు. వీటి నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. రెండు పశువులకు రూ.1.50 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు రూ.2.30 లక్షలు చొప్పున యూనిట్లు మంజూరు చేస్తుందన్నారు. రైతులు వాటా కింద 10 శాతం చెల్లించాలన్నారు. తొలి విడతలో ఎస్సీ, ఎస్టీలకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇప్పటికే నిర్వహించిన గ్రామ సభల్లో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

మదర్ థెరెసాకు ఘన నివాళి



దుస్తులు పంపిణీ చేస్తున్న డా. దుర్గేష్‌కుమార్

బుచ్చెయ్యపేట, ఆగస్టు 24 : వడ్డాది ఎంపీయూపీ మెయిన్ స్కూలులో శనివారం మదర్ థెరెసా జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టరు దుర్గేష్‌కుమార్ మదర్ థెరెసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంస్థ అందించిన దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గేశ్‌కుమార్ మాట్లాడుతూ సేవాభావంలో మదర్ థెరెసా మనకందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు, శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్న సమారాధన



దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస సుధాకర్

చోడవరం, ఆగస్టు 24 : పట్టణంలోని ఎడ్లవీధిలో శనివారం మధ్యాహ్నం టీడీపీ నాయకుడు గొర్లె శ్రీనివాస సుధాకర్ ఆధ్వర్యంలో పేదలకు అన్నవస్త్ర సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి సుప్రభాత సేవ కార్యక్రమం ప్రారంభించి ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా గొర్లె అప్పలనాయుడు స్మారకార్థం పేదలకు భారీ ఎత్తున భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు, పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మండల టీడీపీ నాయకులు ఈర్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న రేషన్ డీలర్లు

దేవరాపల్లి, ఆగస్టు 24 : మండలంలోని గర్సింగిలో రేషన్ డీలరు వద్ద గుమస్తాగా పని చేస్తున్న బోబోలు వీరభద్రాచారి ఇటీవల చనిపోవడంతో ఆ కుటుంబానికి మండల రేషన్ డీలర్ల సంఘం శనివారం రూ.10,200 ఆర్థిక సహాయం అందించారు. రేషన్ డీలర్ల సంఘంలో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకోవడానికి తాము ముందుంటామని వారు పేర్కొన్నారు. రేషన్ డిపోలో 20 సంవత్సరాల నుంచి పని చేసి కిడ్నీ వ్యాధితో వీరభద్రా చారి ఇటీవల మృతి చెందడంతో డీలర్లు అందరూ స్పందించారు. సంఘ సభ్యులు వెత్సార మేమ, విశ్వేష్, స్వామినాయుడు, శ్రీను, సతీష్ పాల్గొన్నారు.

27 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 24 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం(కృష్ణాదేవిపేట) మరిడిమాంబ జాతర సందర్భంగా ఈనెల 27, 28వ తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 26లోగా తమ జట్టు పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. విజేతగా నిలిచే జట్టుకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5,116 ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ : 93915 87322, 90147 97643లో సంప్రదించాలని తెలిపారు.

28న లెక్చరర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

దేవరాపల్లి, ఆగస్టు 24 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులకు ఈ నెల 28న నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బిరాధ శనివారం తెలిపారు. జువాలజీ లెక్చరర్ పోస్టుకు సంబంధిత అంశంలో 50 శాతం మార్కులతో పీజీ చేసి ఉండాలన్నారు. ఒకేషనల్ కోర్సులో కంప్యూటర్ సైన్సు పోస్టుకు బీటెక్‌లో ఏభై శాతం మార్కులు అర్హత కలిగి ఉండాలి. జీఎస్‌సీ (ఎంపి) రూరల్ డెవలప్‌మెంటులో 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. ఈనెల 28న ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

పశువులకు టీకాలు

మాడుగుల రూరల్, ఆగస్టు 24 : జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా శనివారం గొటివాడ అగ్రహారంలో పశువులకు గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వచ్చే నెల 18 వరకు టీకాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ చిట్టినాయుడు పశు వైద్యులు మణి లక్ష్మణ్, పశు సహాయకులు మోదినాయుడు, రైతులు పాల్గొన్నారు.